ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.7, కనిష్ఠం 11.4
కామారెడ్డి జిల్లా వార్తలు
గురువారం 27 నవంబరు 2025



బాలుర, బాలికల కబడ్డీ సెలక్షన్స్

కామారెడ్డి టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డీ చాంపియన్‌షిప్‌కు ఈనెల 29న ఇందిరాగాంధీ స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాణాల భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల కబడ్డీ క్రీడాకారులు ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. 2006 జనవరి 18 తర్వాత జన్మించిన బాలురు, 2005 డిసెంబరు 31 తర్వాత జన్మించిన వారికి ఎలిజిబిలిటి ఉంటుందన్నారు. ఆధార్‌కార్డు, టెన్త్ క్లాస్ మెమో తప్పనిసరిగా తీసుకుని రావాలి. మిగిలిన విషయాలకు 9398571110కు సంప్రదించాలని తెలిపారు.




ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కనులపండువగా
సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

బాన్సువాడ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా పట్టణంలోని అయ్యప్ప ఆయలంలో బుధవారం శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల విరాట్టుకు అయ్యప్ప దీక్షా స్వాములు, భక్తులు ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అర్చకులు పాండురంగ శర్మ, పురుషోత్తమ శర్మలు వేద మంత్రోచ్చారణలతో కల్యాణ ఘట్టాన్ని భక్తులకు వివరిస్తూ ఘనంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. మధ్యాహ్నం తేలికుంట శ్రీధర్ కుటుంబ సభ్యులు అయ్యప్ప దీక్షా స్వాములకు, భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఆవుతోనే ఆర్యోగం, ఐశ్వర్యం సిద్ధిస్తుందని గోపాద యాత్రికుడు బాలకృష్ణ గురుస్వామి అన్నారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. గో సంరక్షణ కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 2700 కి.మీ పాదయాత్ర చేపట్టానని తెలిపారు. గోమాత ఉత్పత్తులు వాడినట్లయితే రోగాలు దూరమవుతాయన్నారు. హిందూ దేవుళ్లపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్న ప్రముఖ దర్శకుడు రాజమౌళి సినిమాలను ప్రజలు బహిష్కరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్ అన్నారు. కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. హిందువులంతా ఐక్యంగా ఉండాలని, లేకపోతే సంఘ విద్రోహక శక్తుల చేతిలో దాడులు జరిగే ప్రమాదం ఉందన్నారు. మతమార్పిడులను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్షపల్లి సాయిరెడ్డి, వ్యవస్థాపక గురుస్వామి బెజుగం శంకర్, తాటి ప్రశాంత్, సిద్ధి మహేశ్, సంజీవ్, సుధాకర్, సచిన్, దీక్షా స్వాములు, భక్తులు తదితరులున్నారు.

చీకోటి ప్రవీణ్‌కు హిందూ సంఘాల ఘన స్వాగతం

బాన్సువాడ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని జక్కల్ దానితండా కొయ్యగుట్ట చౌరస్తాలో బాన్సువాడ పట్టణంలో నిర్వహించే కార్యక్రమానికి వచ్చిన హిందూ ధర్మ పరిరక్షకులు చీకోటి ప్రవీణ్‌కు బుధవారం హిందూ సంఘాల ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని, ధర్మాన్ని మనం కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ సేన సభ్యులు సునీల్, ఫణీందర్‌గౌడ్, సిద్ధార్థ, సాయి, దత్తు, హన్మండ్లు, కిరణ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి.. నామినేషన్లు

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్‌ల ప్రక్రియ కోసం జిల్లా ఎన్నికల అధికారి గురువారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. నేటి నుంచే నామినేషన్ ప్రక్రియ మొదలు కానుంది. ఇందుకోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటి విడతలో కామారెడ్డి డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో ఆయా సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇదివరకే ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసిన మరుసటి క్షణం నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. జిల్లాలో పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నామినేషన్‌లు వేసేందుకు 62 నామినేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేయనున్నారు.

కామారెడ్డి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను మొత్తం మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. అయితే మొదటి విడత ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం నుంచి మొదలు కాగా పోలింగ్ ఫలితాలు 11వ తేదీన వెలువడనున్నాయి. అయితే మొదటి విడతలోని కామారెడ్డి డివిజన్ పరిధిలో 9 మండలాల్లోని 167 గ్రామ పంచాయతీలు, 1,520 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ స్థానాలకు గాను నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నామినేషన్‌లు వేసేందుకు 62 సెంటర్‌లను ఏర్పాటు చేశారు. భిక్కనూరు మండలంలోని 18 జీపీలు, 182 వార్డులకు, బీబీపేటలోని 11 జీపీలు, 110 వార్డులు, దోమకొండలోని 9 జీపీలు, 96 వార్డులు, కామారెడ్డిలోని 14 జీపీలు, 120 వార్డులు, మాచారెడ్డిలోని 25 జీపీలు, 126 వార్డులు, పల్వంచలోని 12 జీపీలు, 110 వార్డులు, రాజంపేటలో 18 జీపీలు, 158 వార్డులు, రామారెడ్డిలో 18 జీపీలు, 166 వార్డులు, సదాశివనగర్‌లో 24 జీపీలు, 214 వార్డుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎన్నికల అధికారులు, సిబ్బంది నియామకం

జిల్లాలో పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణకోసం నోడల్ అధికారులు, పీవోలు, ఆర్‌ఓలు, పీఆర్‌ఓలు, ప్రిసైడింగ్ అధికారులను, అదనపు సిబ్బందిని నియమించారు. 213 మంది రిటర్నింగ్ స్టేజ్-1 అధికారులను, 213 సహాయ రిటర్నింగ్ అధికారులు స్టేజ్-1గా నియమించారు. 640 మంది రిటర్నింగ్ అధికారులు స్టేజ్-2గా నియమించారు. 18 మంది సహాయ రిటర్నింగ్ అధికారులు స్టేజ్-2గా ఏర్పాటు చేయనున్నారు. 2,869 మంది ప్రిసైడింగ్ అధికారులను ఏర్పాటు చేశారు. 3,771 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించారు. ఎన్నికల్లో వచ్చిన ఫిర్యాదులను, వాటిని పరిష్కరించేందుకు రెవెన్యూ అదనపు కలెక్టర్‌తో పాటు మరో ముగ్గురు జిల్లా అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఎన్నికల కోడ్ అమలు చేసేందుకు జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ నోడల్ అధికారిగా మిగితా ముగ్గురు సభ్యులను నియమించారు.

- నోటిఫికేషన్ జారీ చేయనున్న ఎన్నికల అధికారి
- మొదటి విడతలో 167 జీపీలు.. 1,520 వార్డు స్థానాలకు నామినేషన్‌లు
- వీటికి గాను 62 నామినేషన్ సెంటర్‌ల ఏర్పాటు
- అతి సమస్యాత్మకమైన, సమస్యాత్మకమైన కేంద్రాల గుర్తింపు
- నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

అతి సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపు

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా సమస్యాత్మకమైన, అతి సమస్యాత్మకమైన కేంద్రాలను అధికార యంత్రాంగం గుర్తించింది. జిల్లా వ్యాప్తంగా 223 అతి సమస్యాత్మకమైన కేంద్రాలను గుర్తించారు. మొదటి విడతలో 153 అతి సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు, 164 సమస్యాత్మకమైన కేంద్రాలుగా గుర్తించారు. రెండో విడతలో 26 పోలింగ్ కేంద్రాలు అతి సమస్యాత్మకమైనవిగా 223 సమస్యాత్మకమైన కేంద్రాలుగా, మూడో విడతలో 23 అతి సమస్యాత్మకమైనవి 170, సమస్యాత్మకమైనవి పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి అక్కడ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

నేడు జిల్లాలో జాగృతి అధ్యక్షురాలు
కవిత పర్యటన

కామారెడ్డి టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత కామారెడ్డి జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా కవిత గురువారం కామారెడ్డి జిల్లాకు చేరుకోనున్నారు. ఉదయం నిజాంసాగర్ మండలంలో నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును, నిజాంసాగర్ ప్రాజెక్టులను సందర్శిస్తారు. అనంతరం బాన్సువాడలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు చేరుకుని అక్కడ నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకోనున్నారు. అక్కడి నుంచి ఎల్లారెడ్డి నియోజకవర్గం నాగిరెడ్డిపేట మండలంలో ముంపు రైతులతో సమావేశం అవుతారు. లింగంపేటలో గాంధీ, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు నివాళ్లు అర్పిస్తారు. చారిత్రాత్మక నాగన్న బావిని సందర్శించి తాడ్వాయి మండలంలోని శబరిమాత ఆశ్రమం సందర్శన అనంతరం, కామారెడ్డి పట్టణానికి చేరుకుంటారు. రైలు ఢీకొని 90 గొర్రెలు చనిపోయిన ఘటనలో కాపరి సుధాకర్ కుటుంబాన్ని పరామర్శిస్తారు. మరుసటి రోజు శుక్రవారం కామారెడ్డి నియోజకవర్గంలో పర్యటించనున్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కుల సంఘాల అభివృద్ధికి కృషి

రాజంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొందూర్తి గ్రామంలో బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి శాలివాహన, మాదిగ కుల సంఘాల భవనాలకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కుల సంఘాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఇందులో మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వైష్ణవిని సన్మానిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు
చుక్కాపూర్ విద్యార్థిని

మాచారెడ్డి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ పాఠశాల విద్యార్థిని వైష్ణవి మంచి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు సైన్స్ ఉపాధ్యాయురాలు సంయుక్త రాణి బుధవారం తెలిపారు. ఈ మేరకు విద్యార్థినికి పాఠశాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

.. తాడ్కోల్ విద్యార్థి

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ధీరజ్ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో వెజిటేబుల్ ట్రాలీ, కోతకు ఉపయోగించే యంత్రం మోడళ్లను ప్రదర్శించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు రాఘవేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాషా సాహిత్యంలోనే భాష ఉపాధ్యాయులకు
టెట్ నిర్వహించాలి

- రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్ శిక్షక్

కామారెడ్డి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భాషా సాహిత్యంలోనే భాష ఉపాధ్యాయులకు టెట్‌ను నిర్వహించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్ శిక్షక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ భాషలో ఉపాధ్యాయులుకు సంబంధం లేని ఇతర విషయాలపై కాకుండా సంబంధిత భాషా పరిజ్ఞాన సాహిత్య అంశాలపైనే టెట్ ప్రశ్న పత్రాలను తయారు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికిరణ్, చంద్రశేఖర్, శ్యామ్‌కుమార్, రఫీయా తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- కార్మికులను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

8

శుభ కార్యాలకు విరామం



బోధన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రహాల స్థితిని బట్టి కర్మ కాలాలు లేదా మౌఢ్య సమయాలు లాంటివి జ్యోతిష్య శాస్త్రం ద్వారా వినిపించే మాటలు. ఈ సారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలకు విరామం రానుంది. ఈ నెల మార్గశిర శుద్ధ సప్తమి 26 నుంచి ప్రారంభం కానున్న శుక్ర మౌఢ్యమి మూఢం మాఘ బహులా అమావాస్య ఫిబ్రవరి 17 వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభకార్యాలకు సెలవు పడింది.

పవిత్ర తిథులు

మార్గశిర, మాఘ ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈ సారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు మాత్రమే ఉండగా పుష్యమాసం శూన్య మాసం అవుతుంది. ఇక మాఘ మాసంలోనూ ఒక్క ముహూర్తం లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథ సప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహామాఘిగా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులు ఈ సారి మూఢంలోనే కలిసిపోతాయి.

- మూడు నెలల పాటు ముహూర్తాలు లేవు
- ఫిబ్రవరి 17 వరకు శుక్రమౌఢ్యం
- 83 రోజుల తర్వాతే శుభ కార్యాలు

మూఢం అంటే..

జ్యోతిష్యశాస్త్ర ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాల్లో కనుమరుగై పోవడాన్ని మూఢం అంటారు. గ్రహ శక్తులు బలహీనమవ్వడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం ఆర్థిక స్థిరత్వం వంటి విషయాల్లో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిష్యులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు (మిగతా 8లో..)

పంచాయతీ ఎన్నికలను
పకడ్బందీగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ తెలిపారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 532 సర్పంచ్, 4,656 వార్డు స్థానాలు ఉన్నాయన్నారు. వీటికి గాను మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి విడతలో కామారెడ్డి డివిజన్ పరిధిలోని 10 మండలాల్లోని 167 గ్రామ పంచాయతీలు, 1520 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని అన్నారు. గురువారం నామినేషన్‌ల ప్రక్రియ మొదలవుతుందని 11వ తేదీన పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి 1 గంటల వరకు, తర్వాత 2 గంటల నుంచి 4 గంటల వరకు ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు వెల్లడించడం జరుగుతుందన్నారు. రెండో విడతలో 7 మండలాల్లోని 197 గ్రామ పంచాయతీలు, 1654 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని, వీటి నామినేషన్ల ప్రక్రియ ఈనెల 30న మొదలవుతుందని 14న పోలింగ్ అదేరోజు ఫలితాలు వెల్లడిస్తారని తెలిపారు. మూడో విడతలో 8 మండలాల్లోని 168 గ్రామ పంచాయతీలు, 1482 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం డిసెంబరు 3న ప్రక్రియ చేపట్టి 17న పోలింగ్ అదేరోజు ఫలితాలు ఉంటాయన్నారు. నామినేషన్‌ల కోసం జిల్లా వ్యాప్తంగా 174 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి అధికారులను సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 213 మంది రిటర్నింగ్ స్టేజ్-1 అధికారులు, 213 సహాయ రిటర్నింగ్ స్టేజ్-1 అధికారులు నియమించామన్నారు. 640 మంది రిటర్నింగ్ స్టేజ్-2 అధికారులను, 18 మంది సహాయ రిటర్నింగ్ అధికారులు నియమించామన్నారు. 2,869 మంది ప్రిసైడింగ్ అధికారులను, 3,771 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించామన్నారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీ మొత్తం ఓట్లు 6,39,730 ఉన్నాయన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు అయ్యేందుకు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ నోడల్ అధికారిగా నియమించడం జరిగిందన్నారు. ఏమైన (మిగతా 8లో..)

- ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది
- మూడు విడతల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు
- మొదటి విడతకు నేడు నోటిఫికేషన్
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్
- సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- ఎస్పీ రాజేష్‌చంద్ర

ఐదు చోట్ల నామినేషన్ల స్వీకరణ

కామారెడ్డి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్, వార్డు మెంబర్ల నామినేషన్లను ఐదు చోట్ల స్వీకరించనున్నట్లు ఎంపీడీవో హేప్సిబా రాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాసంపల్లి, గర్గుల్, చిన్నమల్లారెడ్డి, నర్సన్నపల్లి, శాబ్దిపూర్ క్లస్టర్లలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. చిన్నమల్లారెడ్డికి చెందిన నామినేషన్‌లు చిన్నమల్లారెడ్డిలోనే స్వీకరిస్తారని, గర్గుల్, ఇస్రోజీవాడి నామినేషన్లు గర్గుల్ జీపీలో, శాబ్దిపూర్, శాబ్దిపూర్ తండా, గూడెంకు సంబంధించిన నామినేషన్లు శాబ్దిపూర్ జీపీలో, క్యాసంపల్లి, క్యాసంపల్లి తండా, రాఘవపూర్, ఉగ్రవాయి గ్రామాలకు సంబంధించి క్యాసంపల్లిలో, నర్సన్నపల్లి, కోటల్‌పల్లి, తిమ్మక్‌పల్లి, లింగాయిపల్లి గ్రామాలకు చెందిన నామినేషన్లు నర్సన్నపల్లిలో స్వీకరించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

భిక్కనూరులో 9 నామినేషన్ కేంద్రాలు

భిక్కనూరు: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా భిక్కనూరు మండలంలో 9 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని బస్వాపూర్, తిప్పాపూర్, జంగంపల్లి, పెద్దమల్లారెడ్డి, మల్లుపల్లి, బాగిర్తిపల్లి, కాచాపూర్, భిక్కనూరు, రామేశ్వర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, నామినేషన్ ప్రక్రియకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలిపారు. మండలంలో ఎన్నికల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

'నజర్'నా ఏది..?

- ఏకగ్రీవ పంచాయతీలకు అందని నజరానా
- ఐక్యంగా ఉన్నా ప్రయోజనం శూన్యం



7

పోరు జోరు

- గ్రామాల్లో మొదలైన సర్పంచ్ ఎన్నికల సందడి
- రిజర్వేషన్ల ఖరారుతో ఉత్సాహం



6

క్రైం సమాచారం

ట్రాక్టర్ కొనివ్వడం లేదని ఆత్మహత్య

బోధన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కొనివ్వడం లేదని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సాలూర మండలంలో చోటుచేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. సాలూర మండలం తగ్గెల్లికి చెందిన సిరిగిరి దేవేందర్(32) వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్ కొంటానని కుటుంబ సభ్యులను కోరాడు. అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడం వల్ల నష్టపోయామని ఇప్పుడే ట్రాక్టర్ వద్దని మరో ఏడాదికి కొందామని కుటుంబ సభ్యులు చెప్పారు. తనకు ట్రాక్టర్ కొనివ్వడం లేదని మనస్తాపానికి గురైన దేవేందర్ ఆత్మహత్యకు మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

కోటగిరి,నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నడిపి సాయిలు(50) చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. సాయిలు బుధవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి మృతి చెందాడన్నారు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

శతాధిక వృద్ధురాలు..


దేవాయి (ఫైల్)

కమ్మర్‌పల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌట్‌పల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు రాజుల దేవాయి(107) బుధవారం ఉదయం కన్నుమూశారు. కుటుంబసభ్యులు అశ్రునయనాలతో సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఏళ్లు పైబడినప్పటికీ వ్యక్తిగత పనులు చేసుకుంటుండేదని, 4 నాలుగు రోజుల నుంచి ఆరోగ్యం క్షీణించి మరణించిందని కుటుంబసభ్యులు తెలిపారు.

మహిళ హత్య.. నిందితుడి అరెస్టు

నవీపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపూర్(ఏ)లో మహిళను హత్య చేసిన నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్లు నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మల్కాపూర్(ఏ)కు చెందిన అనంత అలియాస్ సోని(29)ని వరుసకు మేనమామ అయ్యే మోస్రాకు చెందిన కుమరం అలియాస్ పాండవుల సాగర్ గొంతునులిమి హత్య చేశాడని ఏసీపీ తెలిపారు. సాగర్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా డబ్బులు అవసరమయ్యాయి. దీంతో మల్కాపూర్(ఏ)లో ఇంట్లో ఒంటరిగా ఉన్న అనంతను గొంతు నులిమి హత్య చేసి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, మాటీలు, చెవుల కమ్మలను తీసుకుని పారిపోయ్యాడన్నారు. ఇందులో బంగారు కమ్మలను నిజామాబాద్‌లోని బోధన్ బస్టాండ్ సమీపంలో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.12,500 రుణాన్ని పొందాడని, మిగిలిన పుస్తెల తాడు, మటీలను తన వద్దే ఉంచుకున్నాడన్నారు. నిందితుడిని బుధవారం అరెస్టు చేసి, అతడి నుంచి బంగారు ఆభరణాలతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని పట్టుకున్న నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు తిరుపతి, యాదగిరి గౌడ్, ఏఎస్సైలు గఫర్, రాజేశ్వర్‌ను ఏసీపీ అభినందించారు.

గొలుసు దొంగ..

నవీపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామకు చెందిన సార్గం గంగామణి అనే మహిళ మెడలో నుంచి 2 తులాల పుస్తెల తాడును లాక్కెళ్లిన చైన్ స్నాచర్‌ను బుధవారం అరెస్ట్ చేసినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన నిజామాబాద్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 19న గంగామణి కుటుంబ సభ్యులు బోధన్‌లో ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్లారని అదే రోజు సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళ్లడానికి భర్త, కుమారుడు, కోడలు బైక్‌పై వెళ్లగా గంగామణి బస్సులో జానకంపేట వరకు వచ్చిందన్నారు. జానకంపేట వద్ద యంచ బస్సు కోసం ఎదురు చూస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి లిఫ్ట్ ఇస్తానని మాయమాటలు చెప్పి ఆమెను బైక్‌పై ఎక్కించుకున్నాడని, నందిగామ శివారులో ఆమెను బెదిరించి 2తులాల పుస్తెల తాడు లాక్కోవడంతో పాటు ఆమె వద్ద ఉన్న ఫోన్‌ను తీసుకుని ఆమెను సమీపంలో ఉన్న వడ్ల కుప్పపైన తోసేసి బైక్‌పై పారిపోయాడన్నారు. నిందితుడి కోసం సీసీ కెమెరాలు, కాల్ డేటాను పరిశీలించగా బోధన్ మండలం ఊట్‌పల్లికి పట్‌లోత్ శ్రీకాంత్‌గా గుర్తించామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ కేసును ఛేదించిన ఎస్సైలు తిరుపతి, యాదగిరిగౌడ్, ఏఎస్సై గఫర్, పోలీసు సిబ్బందిని అభినందించారు.

రోడ్డుప్రమాద కారకుడికి జైలు, జరిమానా

కామారెడ్డిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సిరిసిల్లా రోడ్డులో బైక్‌తో ఢీకొట్టి వ్యక్తి మరణానికి కారణమైన నిందితుడికి 9 నెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి దీక్ష బుధవారం తీర్పు వెలువరించారని ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. 2018 డిసెంబరు 03న సామ గంజి ఎల్లయ్య జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్ నుంచి మాచారెడ్డి మండలం సింగరాయిపల్లి వెళ్లేందుకు ఆటో ఎక్కడానికి రోడ్డు దాటుతుండగా గంగవత్ లింగం అనే వ్యక్తి బైక్‌పై అజాగ్రత్తగా వచ్చి ఎల్లయ్యను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి కుమారుడు లక్ష్మీపతి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించారు.

మొరం టిప్పర్ పట్టివేత

నవీపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీసుస్టేషన్ పరిధిలోని మల్కాపూర్ శివారులో మంగళవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. మల్కాపూర్ నుంచి జలాల్‌పూర్‌కు మొరాన్ని అక్రమంగా తరలిస్తుండగా సంబంధిత టిప్పర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు. టిప్పర్ యాజమాని రవి, డ్రైవర్ శ్రీనివాస్‌లపై కేసు నమోదుచేసినట్లు వివరించారు.


బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

బోధన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఆడపిల్లల సంరక్షణనే ధ్యేయమని మహిళ శిశు దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ జిల్లా మహిళ సాధికారిత పారాలీగల్ వలంటీర్ కమిటీ, షీటీం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహలు నిషేధ చట్టం, బాలల హక్కులు, బేటి బచావో, బేటీ పడావో, భిన్న సమానత్వం, పోక్సో చట్టం, అమ్మాయిల విద్య ప్రాధాన్యం తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. 18సంవత్సరాలు పూర్తయిన అమ్మాయిలకు మాత్రమే వివాహం జరిపించాలన్నారు. బాల్య వివాహలను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా సమన్వయకర్త స్వప్న, షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ సునీత, పారాలీగల్ చైల్డ్ కమిటీ వాలంటీర్ సభ్యులు పద్మాలింగ్, బోధన్ పట్టన ఏఎస్ఐ చిరంజీవి, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

రెంజల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తామని చెప్పి, ఏమి చేయలేని స్థితిలో ఉండి రైతుల పేరిట కాలయాపన చేస్తుందని అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్ అన్నారు. బుధవారం సాటాపూర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులకు సమగ్ర రుణమాఫీ ప్రకటించి ధాన్యం సేకరణపై భీమా 17 శాతం నుంచి 22 శాతానికి పెంచి రైతులను ఆదుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలన్నారు. రూ.700 కూలీ అందించాలన్నారు. కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు వృద్ధాప్య పింఛన్‌లు ఇచ్చి 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు పుట్టి నాగన్న, పార్వతి రాజేశ్వర్, గోపాల్, పోశెట్టి, మల్లేష్, జబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

పోరు జోరు



- గ్రామాల్లో మొదలైన సర్పంచ్ ఎన్నికల సందడి
- రిజర్వేషన్ల ఖరారుతో ఉత్సాహం
- స్థానాలు తగ్గడంతో బీసీల్లో నైరాశ్యం
- జనరల్ స్థానాల్లో తీవ్ర పోటీ

అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పల్లె పోరుకు వేళైంది. రెండేళ్లుగా బరిలో నిలుద్దామని కలలు కంటున్న అభ్యర్థుల ఎదురుచూపులకు నిన్నటి నోటిఫికేషన్‌తో తెరపడింది. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు బీసీలకు అధికస్థానాలు ఉండగా.. ప్రస్తుతం కొంత మేర స్థానాలు తగ్గాయి. కాగా జనరల్ స్థానాలు పెరగడంతో పోరు మరింత రసవత్తరంగా మారనుంది. - ఆర్మూర్

ప్రభుత్వం గ్రామ పంచాయితీ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు చేయడంతో గ్రామాలలో ఎన్నికల సందడి మొదలైంది. ఆర్మూర్ సబ్ డివిజన్ పరిధిలో 191 గ్రామ పంచాయతీలు ఉండగా బీసీలకు 46, ఎస్టీలకు 33, ఎస్సీలకు 22, జనరల్‌కు 90 స్థానాలను కేటాయించారు. 2 నెలల క్రితం వచ్చిన రిజర్వేషన్‌ల జాబితాల ప్రకారం బీసీల స్థానాలు తగ్గి జనరల్ స్థానాలు పెరిగాయి. ఇంతకుముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు ఇచ్చిన ప్రభుత్వ నోటిఫికేషన్‌ను కోర్టు ఉత్తర్వుల కారణంగా ప్రభుత్వం రద్దు చేసింది. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న కోర్టు ఉత్తర్వుల మేరకు బీసీల రిజర్వేషన్లను తగ్గించి కొత్తగా ఖరారు చేయడంతో బీసీల స్థానాలు తగ్గిపోయాయి.

మేజర్ పంచాయతీల్లో అభ్యర్థులకు సవాళ్లు..

సర్పంచ్‌గా పోటీలో నిలవాలనుకున్న అభ్యర్థులు 6నెలల నుంచే గ్రామాల్లో వినాయక చవితి, దుర్గామాత ఉత్సవాల సందర్భంగా ఉత్సవ నిర్వాహకులకు భారీగా చందాలిచ్చి మచ్చిక చేసుకున్నారు. యువకులు తమకు పనిచేస్తారన్న భావనతో కలుపుగోలుగా ఉంటూ విందులు ఇచ్చారు. 6నెలల నుంచి ఖర్చుపెట్టడంతో ఒక్కొక్కరికి ఖర్చు తడిసి మోపెడైంది. మేజర్ గ్రామ పంచాయతీల్లో పోటీచేసే వారు ఎన్నికలు పూర్తయ్యే వరకు రూ.40-50 లక్షలు ఖర్చు పెట్టాల్సి వచ్చేలా ఉంది.

రిజర్వేషన్ల తారుమారుతో నిరుత్సాహం..



ఇంతకుముందు ప్రకటించిన రిజర్వేషన్లలో తమకు అనుకూలంగా రావడంతో నాయకులు పోటీకి ముందుకు వచ్చారు. తాజాగా రిజర్వేషన్లు మారడంతో వారు నిరుత్సాహానికి గురయ్యారు. ఇంతకుముందు ఏర్గట్ల పంచాయతీ బీసీ మహిళ, బాల్కొండ బీసీలకు, ఆలూరు బీసీలకు రిజర్వ్ చేయగా.. ప్రస్తుతం జనరల్‌కు కేటాయించారు. దీంతో పోటీదారులు పెరగడంతో బీసీ అభ్యర్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

అయ్యప్ప మాలకు దూరంగా..

సర్పంచ్ ఎన్నికలు అయ్యప్ప మాలధారులకు ఈసారి కష్టంగా మారనుంది. ప్రతీ గ్రామంలో అయ్యప్ప మాల వేసుకుంటారు. ఈసారి ఎన్నికలు రావడంతో ఎలా అని సంకోచిస్తున్నారు. స్వామిమాలాధారులు నియమ నిష్టలతో ఉండాలి. ఎన్నికల కారణంగా దీక్ష తీసుకోకపోవడమే ఉత్తమమని పలువురు భావిస్తున్నట్లు సమాచారం.


రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పిస్తున్న డీఎల్పీవో నాగరాజు

ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

- బోధన్ డీఎల్పీవో నాగరాజు

ఎడపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని బోధన్ డీఎల్పీవో నాగరాజు అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం డీఎల్పీవో నాగరాజు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ నుంచి ఫలితాల విడుదల వరకు ఎలాంటి చర్యలు చేపట్టాలో వారికి వివరించారు. అధికారులు నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని 9 పోలింగ్ కేంద్రాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎస్సై రమ, ఎంపీవో మన్మోహన్‌శాస్త్రి, పంచాయితీ కార్యదర్శులు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈవో పి.అశోక్ కుమార్

క్రీడలతో ఉద్యోగావకాశాలు

- జిల్లా విద్యాధికారి పర్లి అశోక్ కుమార్

నందిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జిల్లా విద్యాధికారి పర్లి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఎస్ఎస్ఆర్ గ్రీన్ ఫీల్డ్ స్కూల్‌లో ఇంట్రా స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవాలకు డీఈవో ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించి విద్యార్థుల వందనం స్వీకరించారు. స్పోర్ట్స్ సర్టిఫికెట్ ఉంటే పైచదువుల్లోనూ అవకాశాలు ఉంటాయన్నారు. క్రీడలతో ఓర్పు, క్రమ శిక్షణ అలవాటు అవుతుందన్నారు. ఈ క్రీడల్లో ఎస్ఎస్ఆర్ సీనియర్ సెకండరీ స్కూల్(జన్నేపల్లి), ఎస్ఎస్ఆర్ డిస్కవరీ స్కూల్, ఎస్ఎస్ఆర్ గ్రీన్ ఫీల్డ్ స్కూల్ విద్యార్థులు వివిధ ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ గ్రూప్ ఛైర్మన్ డా.మారయ్య గౌడ్, సీఈవో హరితగౌడ్, డైరెక్టర్ హర్షిత్ గౌడ్, ప్రిన్సిపాల్ మెరిగ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

కోటగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రతిభ కనబర్చడం అభినందనీయమని నిజామాబాద్ జిల్లా ఆర్ఎల్‌సీ బషీర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో భారత రాజ్యాంగం ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉందని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరు రాజ్యాంగానికి అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో అవార్డులు పొందడంపై ఆయన అభినందించారు. చదువుతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాలలో విద్యార్థులు రాణించాలని సూచించారు. జిల్లాస్థాయి క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబర్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీక్, ఉపాధ్యాయులు, వార్డెన్ అయాజ్ తదితరులున్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న నిజామాబాద్ ఆర్ఎల్‌సీ బషీర్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాల సాహిత్య వేదిక జిల్లాధ్యక్షుడు నరేష్

'నీలా.. నీలాలు' పుస్తకావిష్కరణ

రెంజల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలా జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 13మంది విద్యార్థులు రచించిన 'నీలా.. నీలాలు' అనే పుస్తకాన్ని బుధవారం పాఠశాలలో ఇందూరు బాల సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులే కవులుగా, రచయితలుగా మారి తమ ఆలోచనలను అక్షర రూపం ఇవ్వడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ ఘనతను సాధించిన నీలా పాఠశాల విద్యార్థులు బాల కవులుగా కీర్తి పొందుతారని పేర్కొన్నారు. ఈ పుస్తకాన్ని రచించిన విద్యార్థులను అభినందించారు. నీలా గ్రామం, ఆచారాలు, పరిస్థితుల గురించి పుస్తకంలో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణ, ఇందూర్ జిల్లా బాల సాహిత్య వేదిక జిల్లా కోశాధికారి చింతల శ్రీనివాస్‌గుప్తా, పీఆర్‌టీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, ఉపాధ్యాయులు ఆనంద్, శ్రీనివాస్ గుప్తా, సుధ, తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. బిడ్డా

- ఆటో ఢీకొని 13నెలల చిన్నారి మృతి
- సాలంపాడ్ గ్రామంలో విషాదఛాయలు



బోధన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 13 ఏళ్ల చిన్నారి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లాలో జరిగింది. అంతవరకు ఆ పసిపాప నవ్వులు ఇంట్లో విరబూయగా.. ఒక్కసారిగా కానరాని లోకాలకు వెళ్లడంతో ఆ పాప తల్లిదండ్రులు కుమిలిపోయారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలంపాడ్ గ్రామానికి చెందిన 13 నెలల చిన్నారిని అతి వేగంగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సాలంపాడ్ గ్రామానికి చెందిన ఇర్ఫాన్, అయేషా బేగం దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె అనయాన ఉన్నారు. కాగా బుధవారం అనయాన ఇంటి ముందు ఆడుతుండగా అదే సమయంలో బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌కు చెందిన అబ్దుల్ ఖాదర్ ఆటోలో ఉల్లిగడ్డలు వేసుకుని అమ్మడానికి వచ్చాడు. ఆటోను వేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ఇంటి ముందు కూర్చున్న చిన్నారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో చిన్నారి తలపై నుంచి ఆటో వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. చిన్నారి మృతికి కారకుడైన అబ్దుల్ ఖాదర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్తాం

పెర్కిట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం, పీడీఎస్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని సీవీఆర్ గ్రౌండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ర్యాలీగా బయలుదేరారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఏళ్లుగా విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నా.. ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా లేదన్నారు. పీడీఎస్‌యూ 23వ జిల్లా మహసభలను కామారెడ్డి పట్టణంలో ఈ నెల 28వ తేదీన నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఉంటుందని ఈ బహిరంగ సభకు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాజీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి, సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, అనిల్ పాల్గొంటారని ఈ మహసభకు విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆర్మూర్ ఏరియా పీడీఎస్ అధ్యక్షుడు నిఖిల్, ప్రధాన కార్యదర్శి ఇ.రాజు, సహయ కార్యదర్శి సిద్దు, వివేక్, వినయ్, వెంకట్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

బోధన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ జిల్లా 23వ మహసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్.గౌతం కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రగతిశీల ప్రజాసౌమ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా మహసభల గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28, 29వ తేదీలలో ఆర్మూర్ పట్టణ కేంద్రంలో జిల్లా మహసభలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి జిల్లా మహసభలను జయప్రదం చేయాలన్నారు. 2 రోజుల పాటు జిల్లా మహసభలు కొనసాగుతాయన్నారు. జిల్లా నాయకులు సాయినాథ్, బలరాం, బాలకృష్ణ, సామెల్, అర్జున్, అరవింద్, అశోక్, భానుచంద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

ముప్కాల్: మండల కేంద్రంలో జిల్లా ఆదివాసీ నాయకపోడ్ సేవాసంఘం అధ్యక్షుడు గాండ్ల రాంచందర్ అధ్యక్షతన మంగళవారం నియోజకవర్గ కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నాయకపోడ్ కులస్థులకు ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అన్యాయం గురించి చర్చించి లంబాడాలను ఎస్‌టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి గంగ సాయన్న, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు లోలం గంగాధర్, కార్యవర్గ సభ్యులు సతీష్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు శివశంకర్, గ్రామ కులపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి ఇస్తాం

ముప్కాల్: అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో బుధవారం నూతన ఇందిరమ్మ గృహప్రవేశానికి హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారంతా వెంటనే పనులు చేపట్టాలని సూచించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ముప్కాల్: బాల్కొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, కేజీబీవీ పాఠశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం ప్రాధాన్యత విద్యార్థుల బాధ్యత అనే అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ రజిద్దీన్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కేజీబీవీలో విద్యార్థినిలకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఎంఈవో రాజేశ్వర్, కేజీబీవీ ప్రత్యేకాధికారి భవాని పాల్గొన్నారు.

నమూనా పంచాయితీ ఎన్నికలు

వేల్పూర్: వేల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులతో నమూన గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు రాజన్న తెలిపారు. ఈ ఎన్నికలలో మొత్తం 13 మంది వార్డుసభ్యులు, ఒక సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నుకున్నామన్నారు. 10వ తరగతి విద్యార్థులు సర్పంచ్‌లుగా అభిరాం, ఉపసర్పంచ్‌గా శ్రీనిక ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ప్రభాకర్, దేవనందం వ్యవహరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యత పరిశీలన

వేల్పూర్: మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామం నుంచి మోతెకు వెళ్లే రోడ్డు నాణ్యతను క్యూసీ అధికారులు పరిశీలించారు. రూ.కోటి నిధులతో కి.మీ మేర బీటీ నిర్మించనున్నారు. 3 నెలల క్రితం రోడ్డుపై పోసిన కంకర నాణ్యతను నేల స్వభావం ఏ విధంగా ఉందనే నాణ్యతను వివిధ పరికరాల ద్వారా క్యూసీ ఈఈ శైలేందర్, డీఈఈ వీరనంద్ పరిశీలించారు. కంకర వేసిన రోడ్డు పూర్తి నాణ్యతతో ఉన్నప్పుడే ఆ రోడ్డుపై బీటీ వేయడం జరుగుతుందన్నారు. ఆర్మూర్ పీఆర్‌డీఈ రాజేశ్వర్, బాల్కొండ డీఈ హైమద్, ఏఈలు శ్రీనివాస్, శ్రీధర్, సిబ్బంది తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆలూర్: మండలంలోని ఆలూర్ గ్రామానికి చెందిన ప్రదీప్, గంగాధర్, వసంత్, పోశెట్టి, పోసాని, అమృత్, సౌజన్య ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యేలా చొరవతీసుకున్నారు. ఈ మేరకు చెక్కులను పార్టీ నాయకులు అందజేశారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు శిక్షణ

భీమ్‌గల్ రూరల్: గ్రామ పంచాయితీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు, పంచాయితీ కార్యదర్శులకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సంతోష్ కుమార్ ముందస్తు సమావేశం నిర్వహించి అధికారులకు కరదీపిక ద్వారా శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ .. మండలంలోని 27 గ్రామ పంచాయితీలో మూడోదశ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. రిటర్నింగ్ అధికారులు 9 గ్రామ పంచాయితీల్లో నామినేషన్ కౌంటర్లు ఏర్పాటుచేసి 27 గ్రామ పంచాయితీలకు సంబంధించి ఆయా గ్రామాల్లో నామినేషన్ స్వీకరణ జరుగుతుందన్నారు. ఎంపీవో జావిద్ అలీ, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పంచాయితీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రేరణ అవార్డుకు ఎంపికైన విద్యార్థి

మోర్తాడ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎన్.ప్రద్యుత్ తయారు చేసిన ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యారు. ఆయనకు గైడ్ టీచర్‌గా వినోద్ వ్యవహరించారు. బుధవారం విద్యార్థిని హెచ్ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు అశోక్, దీపిక, రవీందర్, రవి, ఇందిరా, శకుంతల, రాము, భూలక్ష్మి అభినందించారు.

ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ

జక్రాన్‌పల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జక్రాన్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం స్టేజ్-1 అధికారులకు శిక్షణ అధికారులు అవగాహన కల్పించారు. నామినేషన్‌లు ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్ కుమార్, ఎంపీవో యూసుఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

శివాలయంలో హుండీ లెక్కింపు

బోధన్: పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ లెక్కింపులో 2,00,291 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల తెలిపారు. హుండీ లెక్కింపులో వనిత క్లబ్ సభ్యులు, పట్టణ వైశ్య సంఘం మహిళలు పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాములు, అర్చకులు గణేష్ శర్మ, శివకుమార్, మహేష్, సిబ్బంది సుధాకర్, చంద్రకళ, పుష్ప తదితరులున్నారు.

అమ్మవారి ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి

బోధన్: బోధన్ గ్రామ దేవత పోచమ్మ అమ్మవారి ఆశీస్సులతో బోధన్ ప్రజలు సుభిక్షంగా ఉండాలని మహాలక్ష్మి ట్రస్ట్, పట్టణ అభివృద్ధి కమిటీ నాయకులు బీర్కూర్ బుజ్జి, ప్రదీప్ గుప్తా, గుండెటి శంకర్‌లు అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని బురుడు గల్లీలోని పురాతన పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం చేసి పనులను ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల అవసరాలు దృష్టిలో ఉంచుకుని ఆధునిక సదుపాయాలతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ట్రస్ట్ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కోటగిరి: ఇంటర్ ఫలితాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉమ్మడి జిల్లా ఆర్ఎల్‌సీ ఎండీ బషీర్ సూచించారు. కోటగిరిలోని మైనారిటీ గురుకుల కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. కళాశాలలో రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశమయ్యారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయడంతో పాటు ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలన్నారు. కోటగిరి కళాశాల గత ఆరేళ్లుగా వందశాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ మొబిన్ ఉన్నారు.

మల్లన్న స్వామిని దర్శించుకున్న వినయ్‌రెడ్డి

ఆలూర్: మండల కేంద్రంలో కండె రాయుడు మల్లన్న స్వామిని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వినయ్‌కుమార్ రెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మాక్లూర్ పీఏసీఎస్ ఛైర్మన్ బుర్రొల్ల అశోక్ ఆయన్ను సన్మానించారు. పార్టీ మండలాధ్యక్షుడు విజయ్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు సూర్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, చిరంజీవి, ఉదయ్, ముత్యంరెడ్డి, కిషన్, గంగారెడ్డి, సంజీవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అగ్గి మల్లన్న రథోత్సవం

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో బుధవారం అగ్గిమల్లన్న ఆలయ జాతర ఉత్సవాలను యాదవ సంఘ సభ్యులు, గ్రామస్థులు ఘనంగా జరుపు కొన్నారు. సాయంత్రం మల్లన్న స్వామి రథోత్సవం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో రథోత్సవానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



'నజర్'నా ఏది..?

▸▸ ఏకగ్రీవ పంచాయతీలకు అందని నజరానా ▸▸ ఐక్యంగా ఉన్నా ప్రయోజనం శూన్యం



పంచాయతీ ఎన్నికల వేళ ఏకగ్రీవ చర్చ మళ్లీ మొదలైంది. గత ఎన్నికలో సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం చేసుకునే గ్రామాలకు బీఆర్ఎస్ సర్కార్ రూ. 15 లక్షల నజరానా ఇస్తామని ప్రకటించింది. వాటితో గ్రామాభివృద్ధి చేసుకోవచ్చని కొన్ని గ్రామాలు సర్పంచ్ పదవులను ఏకగ్రీవం చేసుకున్నాయి. ఐకమత్యాన్ని చాటుకోవాలనే స్ఫూర్తితో ప్రజలంతా ఎన్నికల వ్యయం లేకుండా చూసుకోవడంతో పాటు ప్రభుత్వ నజరానా వస్తుందని ఆశించి ఏకగ్రీవంగా సర్పంచులను ప్రకటించుకున్నారు. కానీ పలువురు నిరాశ చెందాల్సిన పరిస్థితి నెలకొంది.

మద్నూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో గత 2019 ఎన్నికల్లో పెద్ద ఎక్లార, లింబూర్, సిర్పూర్, తాడిహిప్పర్గ గ్రామపంచాయతీలను అక్కడి ప్రజలు సర్పంచ్ పదవులను ఏకగ్రీవం చేసుకున్నారు. సర్పంచులు చేసే ఖర్చులను ఆదా చేసుకోవడమే కాకుండా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు అభివృద్ధికి వినియోగించుకోవచ్చని ఆశించారు. అయితే ఐదేళ్ల కాల పరిమితిలో పారితోషికం విడుదల చేయకపోవడంతో ఆ గ్రామాల ప్రజలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ప్రస్తుతం పంచాయితీ పోరుకు మొదలై సర్పంచు రిజర్వేషన్లు కూడా ప్రకటించడంతో ఎన్నికల సందడి మొదలైంది.



ఎస్సీకాలనీలో వాటర్‌ట్యాంక్ లేక నీటికష్టాలు

మళ్లీ పారితోషికం ప్రకటన

ఈ క్రమంలో ఏకగ్రీవం చేసుకునే పంచాయితీలకు ప్రభుత్వం మళ్లీ రూ.10 లక్షల నజరానా ప్రకటించింది. పారితోషికం ప్రకటించిన నేపథ్యంలో గ్రామ పంచాయితీలను ఏకగ్రీవం చేసుకునేందుకు ఎన్ని గ్రామాలు ముందుకు వస్తాయో వేచి చూడాలి మరి. అప్పట్లో గ్రామ పంచాయతీలకు పారితోషికం రాకపోవడంతో ఆయా గ్రామ సర్పంచులు అభివృద్ధి పనుల కోసం తమ డబ్బులను ఖర్చు పెట్టుకున్నారు.

అభివృద్ధి చేసి.. ఆవేదన చెందుతూ..

పెద్దఎక్లారా సర్పంచ్ రూ.4లక్షలు, లిం బూర్ రూ. 1.50 లక్షల బిల్లులు రావాల్సి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారితోషికం నిధులు వచ్చినట్లయితే గ్రామాల్లో రోడ్లు నీటి సమస్య తీర్చుకుంటామని సంబరం పడిన గ్రామస్థులకు నిరాశ ఎదురైంది. పెద్దఎక్లారా గ్రామా నికి రోడ్డు గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల ప్రస్తుత ఎమ్మెల్యే నిధు లతో మొరం వేయించారు. అదే విధంగా లింబూర్‌లో ఎస్సీ కాలనీ ప్రజల కోసం అక్కడి మాజీ సర్పంచ్ మధుకర్ తన పంట భూమిలో వేసిన బోరు నుంచి పైపులైన్ చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మించినట్లయితే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

తీరని నీటిసమస్య



మా గ్రామంలోని ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంక్ లేకపోవడంతో కాలనీ వాసులకు నీటిసమస్య తీరడం లేదు. నా సొంత భూమిలో వేసిన బోరు నుంచి వాటర్ పైపుల ద్వారా వారికి నీటిని సరఫరా చేస్తున్నా. గతంలో ప్రభుత్వం ప్రకటించిన పారితోషికం వస్తే వాటర్ ట్యాంక్ నిర్మిస్తానని హామీ ఇచ్చాను.

- మధుకర్, లింబూర్, మాజీ సర్పంచ్



ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గంగపుత్ర సభ్యులు

మౌలిక సదుపాయాలు కల్పించండి

బీర్కూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీకి చెందిన గంగపుత్రులు బుధవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీర్కూర్ మండల కేంద్రంలోని వైయస్సార్ కాలనీలో గత 14 ఏళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏటా వర్షాకాలంలో బయటకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కోవాల్సి వస్తుందన్నారు. రహదారులపై మురికి నీళ్ల పారుతున్నాయని, దీంతో దోమలు, ఈగలు, విష కీటకాలు వృద్ధి చెందుతున్నాయని వాపోయారు. పందులు స్వైరవిహారం చేయడంతో కాలనీలో దుర్వాసన వెదజల్లుతుందన్నారు. దీంతో ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారన్నారు. రోడ్ల నిర్మాణం చేయకపోవడం వల్ల ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులు ఇసుక, ఇటుక, కంకర తెచ్చుకోని పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే స్పందించి కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాన్సువాడ టౌన్: పట్టణంలోని కోటగల్లీకి చెందిన కొట్టంల గంగాధర్ ఇంటి గృహప్రవేశ ప్రవేశానికి బుధవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యజమాని, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి కలి శరోహణ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 2వ రోజు బుధవారం ఉదయం పారాయణం, నిత్య మూల మంత్ర సహిత చండీహోమం, మృత్తిక సరపనం, పంచగవ్యదివాసం, క్షరదివాసం, నివేదన, మంగళనీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు కొనసాగాయి. సాయంత్రం లలితసహస్ర నామపారాయణం, నిత్యహోమం, ఫల, పుష్ప, ఛాయ ధాన్య, శయ్య ఆదివాసలు, నివేదన, నీరాజనం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాలన్నీ అభిషేక్ ఆచార్య పర్యవేక్షణలో జరిగాయి. 27వ తేదీన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు పూర్తవుతాయని గ్రామ పెద్దలు తెలిపారు. 3రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన



ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేందర్

బీర్కూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీర్కూర్ ఎస్సై మహేందర్ మండలవ్యాప్తంగా పర్యటిస్తూ ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించిన ముఖ్యాంశాలను ప్రజలకు వివరించారు. ప్రజలు కులాలు, మతాలు లేదా వర్గాల మధ్య ఉద్రిక్తతలు, విద్వేషాలు రెచ్చగొట్టే పనులు చేయకూడదన్నారు. ఓట్ల కోసం మతం, కులం పేరుతో అభ్యర్థించకూడదన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలను ఎన్నికల ప్రచారానికి వాడకూడదని తెలిపారు. విధానాలు, పథకాలపై మాత్రమే విమర్శలు చేయాలని, అభ్యర్థుల వ్యక్తిగత జీవితంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ మండల అధ్యక్షుడిపై వేటు

మద్నూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల ఓబీసీ అధ్యక్షుడు రాజును కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు ధరాస్ సాయిలు తెలిపారు. పార్టీ విధానాలకు విరుద్ధంగా, పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పార్టీ నిర్ణయాలు, విధానాలకు విరుద్ధంగా పనిచేసే ఎవరికైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ శ్రేణులలో అనుశాసనం కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలన్నారు.

అయ్యప్ప ఆలయంలో అభిషేకాలు



అయ్యప్ప ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

పిట్లం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పిట్లంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సుబ్రమణ్య స్వామి షష్ఠి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు జగదీష్ తెలిపారు. ఉదయం స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలువురు దంపతులు, యువకులు అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం మండలానికి చెందిన దయాళ్ సేట్ దంపతులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకుడు వివేక్, ఆలయ కమిటీ శాశ్వత అధ్యక్షుడు ఈశ్వర్ దయాళ్ రెడ్డి, గురుస్వాములు భగవాన్, నర్సాగౌడ్, నాగరాజు, కమిటీ సభ్యులు, స్వాములు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు క్రీడాపోటీలు

బీర్కూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28వ తేదీన కామారెడ్డి జిల్లా కేంద్రంలో క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు కుమ్మరి సాయిలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఈ పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో పోటీలకు వెళ్లొచ్చన్నారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. చెస్, క్యారమ్, షాట్‌పుట్, రన్నింగ్, బౌలింగ్ త్రో పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ పోటీల్లో ఆసక్తి గలవారు పాల్గొనాలన్నారు.

ఏబీవీపీ నవీపేట నూతన కమిటీ ఎన్నిక

నవీపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ నవీపేట నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిందర్ తెలిపారు. ఏబీవీపీ నవీపేట నగర కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా నిఖిల్, వైష్ణవి, రాజేష్, ఆదిల్, నగర బాలికల కన్వీనర్‌గా మాధవి లత, హాస్టల్స్ కన్వీనర్‌గా భగవాన్‌లను ఎన్నుకున్నామన్నారు.

క్యాంపస్ ముచ్చట్లు

టీయూ హెల్త్‌సెంటర్ ఇన్‌చార్జ్‌గా గోపిరాజ్



నియామక పత్రం అందుకుంటున్న గోపిరాజు

సుభాష్‌నగర్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం హెల్త్ సెంటర్ ఇంచార్జ్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ గోపిరాజును నియమిస్తూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.యాదగిరి ఉత్తర్వులు జారీచేశా రు. డిచ్‌పల్లిలోని టీయూలోని రిజిస్ట్రార్ చాంబర్‌లో రిజిస్ట్రార్ ఎం.యాదగిరి నియామక ఉత్తర్వులను గోపి రాజుకు బుధవారం అందజేశారు. తనపై నమ్మకం ఉంచి హెల్త్ సెంటర్ ఇంచార్జ్‌గా నియమించినందుకు వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డిబార్

సుభాష్‌నగర్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో 6వ రోజు జరిగిన డిగ్రీ పరీక్షల్లో ఒకరిని డిబార్ చేసినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ తెలిపారు. నిజామాబాద్ ప్రభుత్వ గిరిరాజ్ కళాశాలలో ఒకరిని డిబార్ చేసినట్లు తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షల్లో 1671 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1545 మంది హాజరయ్యారని, 125 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 5140 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4916 మంది విద్యార్థులు హాజరుకాగా 224 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

తెలంగాణ వర్సిటీలో రాజ్యాంగ దినోత్సవం

తెలంగాణ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని యూనివర్సిటీ ఆఫ్ లాలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ కె.అపర్ణ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ఆమోదం, అమలులోకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని రాజ్యాంగం ప్రాధాన్యతను, విలువలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏకస్వరంతో నిలబడి భారత రాజ్యాంగ పీఠికను చదివారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.స్రవంతి, వాలంటీర్లు, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏసీపీ రాజావెంకట్ రెడ్డి

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల ముగింపు

నవీపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో గత 3 రోజులుగా కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడాపోటీలు బుధవారం సాయంత్రం ముగిశాయి. పోటీలలో గెలుపొందిన జట్లకు నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో అశోక్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు భూమయ్య, ప్రధాన కార్యదర్శి శివకుమార్, హెచ్‌ఎం శ్రీదీప్, ఎస్ఐ తిరుపతి, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

లారీల కొరత లేకుండా చూస్తాం



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు

నాగిరెడ్డిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు లారీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని కామారెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు. మండలంలోని చీనూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఇప్పటివరకు మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన వివరాలను ఆయన స్థానిక ఐకేపీ ఏపీఎం రాం నారాయణ గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 13 కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇప్పటివరకు 72 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఏపీఎం అధికారికి వివరించారు. ప్రస్తుతం కేంద్రాల్లో 6 ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా నిర్వహించాలని, లారీలు వచ్చేవరకు ధాన్యాన్ని తూకం వేసి సిద్ధంగా ఉంచాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేష్, సెంటర్ ఇన్‌చార్జి రవి, సీసీ దత్తు, వీవోఏ మేనక పాల్గొన్నారు.



నవీపేటలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

నవీపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీసుస్టేషన్ పరిధిలోని మల్కాపూర్(ఏ)లో ఈ నెల 24న ఆకుల అనంతను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత కోరారు. బుధవారం ఆమె నవీపేటలో మాట్లాడుతూ.. మహిళలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రమ, కొండపల్లి పుష్ప, గంగామణి, విజయ తదితరులున్నారు.

నేడు పడిగెల్‌లో ఆదిమల్లన్న జాతర

వేల్పూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామ శివారులో గుట్ట ఆలయం వద్ద గురువారం నిర్వహించనున్న ఆదిమల్లన్న స్వామి జాతర మహోత్సవాలకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. భక్తుల సౌకర్యార్థం వసతులు ఏర్పాటుచేశారు. బుధవారం సాయంత్రం రంగురంగుల బంతిపూలతో అలంకరించిన రథాన్ని రామాలయం నుంచి ప్రధాన వీధుల గుండా జాతర జరిగే గుట్ట ఆలయం వరకు తాళ్ల సాయంతో లాగుతూ తీసుకువచ్చారు. శుక్రవారం నైవేద్యం, రాత్రి నాగవెల్లి, అగ్నిగుండం, శావ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



జాతరకు ముస్తాబైన పడిగెల ఆదిమల్లన్న స్వామి ఆలయం



విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఈవో

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఆర్మూర్ విద్యార్థులు

ఆర్మూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్‌లోని శ్రీ భాషిత పాఠశాల విద్యార్థులు అక్షయ, నిహారికశ్రీ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ తెలిపారు. ఇటీవల బోధన్‌లో జరిగిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో శ్రీభాషిత విద్యార్థినిలు వాయు నాణ్యతను కొలిచే, నియంత్రించే ప్రాజెక్టును తయారు చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు జిల్లా విద్యాశాఖ అధికారుల ప్రశంసలు పొందడమే కాకుండా రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



గోపాల్‌పేట్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా బృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పరిసరాల పరిశు భ్రతతో పాటు, తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ నివారణ, గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాల వాడకంతో జరిగే అనర్థాల గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత నియమాలను ప్రతి వాహనదారుడు పాటించాలన్నారు. కార్యక్రమంలో మహేందర్, పోశెట్టి, రామచంద్రం, లక్ష్మీనారాయణ, నరేష్, నాగరాజు, సవిత, శిల్ప, లత పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

బాన్సువాడటౌన్, నవంబరు 26: (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు డా.బాబా సాహెబ్ అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ.. బాబా సాహెబ్ కృషితోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ కిరణ్మయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి రాజ్యాంగ పీఠికను చదివారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, ఏజాస్, నెర్రె నర్సింలు, ప్రశాంత్, మన్నె చిన్న సాయిలు, విఠల్ తదితరులున్నారు.

నసురుల్లాబాద్: మండల వ్యాప్తంగా బుధవారం అధికారులు, నాయకులు సంవిధాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా దుర్కి సొసైటీ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం వల్ల దేశంలోని ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం, ఓటు హక్కు, మహిళల కోసం అనేక చట్టాలు కల్పించడం వల్లనే భారతదేశ ఆధునిక పితామహుడు అని పిలవడం జరుగుతుందన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చినందుకు సంవిధాన్ దివస్ జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మైసయ్య, శంకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పిట్లం: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పిట్లం అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు చిలక సాయిలు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు బుర్రం బాలరాజ్, జంగం లక్ష్మణ్, జంగం బాలు, వడ్డేపల్లి రమేష్, జంగం నగేష్ ఎనిగే హనుమాన్లు, బుర్రెమ్ సాయిలు, బక్క రమేష్, గులని లాలు, జంగం దినాకర్, గులాని కుమార్, బుర్రం రవికుమార్, హనుమాండ్లు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న పోచారం



దుర్కిలో రాజ్యాంగ దినోత్సవాల దృశ్యం



పిట్లంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సంఘం నాయకులు



పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్

పీసీసీ చీఫ్‌ను కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు

నందిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌ను నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో ఆర్మూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌ను సన్మానించారు. అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉంటూ సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత యువజన కాంగ్రెస్‌పై ఉందని అన్నారు. అభ్యర్థుల ఎంపిక. గెలుపు సాధ్యాసాధ్యాలపై మహేష్ కుమార్ దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ గెలుపుకోసం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్రగ్‌డీఅడిక్షన్ సెంటర్ ఇన్‌చార్జ్

కామారెడ్డిటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత నడుం బిగించాలని డ్రగ్‌డీ అడిక్షన్ సెంటర్ ఇన్‌చార్జ్ మిడతపల్లి గణపతి అన్నారు. బుధవారం శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభవిష్యత్‌కు పునాదిగా నిలవాల్సిన యువత ఆల్కహాల్, మాదకద్రవ్యాల మత్తులో జీవితాన్ని చిత్తు చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి, డ్రగ్స్ మద్యపానం వంటి మాదకద్రవ్యాలకు నేటి యువత బానిసలై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. వైద్యుల పర్యవేక్షణలో డ్రగ్‌డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఉచిత వైద్యం, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్స్ రాజు, స్వామి, చరణ్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి



భిక్కనూరులో ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం ప్రతినిధులు

భిక్కనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పక్కన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బుధవారం గ్రామపంచాయతీ ఈవో మహేష్‌గౌడ్‌కు రజక సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఆధీనంలో ఉన్న స్థలంలో విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుండగా కొందరు అడ్డుకుంటున్నారన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించి విగ్రహ ఏర్పాటుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బుచ్చగారి రవి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



హన్మాండ్లు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బాన్సువాడ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఉద్దెర హన్మాండ్లు ఇటీవల మృతిచెందగా బుధవారం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. హన్మాండ్లు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌జుబేర్, సాయిబాబా, బోడచందర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

కామారెడ్డి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలంలోని ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు షరీఫోద్దీన్‌కు ఉచిత ట్రై సైకిల్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ అందించారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మామిండ్ల అంజయ్య, విజయ్‌రెడ్డి, ఉర్దొండ రవి, చాట్ల వంశీ, పంపరి శ్రీను, సాయిబాబా, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ అధ్యక్షుడిగా మహేష్



మహేష్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ అధ్యక్షుడిగా మహేష్ నియామకమయ్యారు. బుధవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దేల జితేందర్, స్టేట్ యంగ్ బ్రిగేడ్ అధ్యక్షుడు తెల్లశ్రవన్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో యూత్‌సభ్యులు మున్న శశి, అజీజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట ఎస్‌ఐగా విజయ్



బీబీపేట ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ్

దోమకొండ, 9(బీబీపేట) నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బీబీపేట ఎస్‌ఐగా కె.విజయ్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన మద్నూర్ నుంచి సాధారణ బదిలీపై బీబీపేటకు వచ్చారు. బీబీపేటలో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన ఎం.ప్రభాకర్ దోమకొండకు బదిలీపై వెళ్లారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కామారెడ్డి రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముదాం అరుణ్, దశరత్, మోహన్‌పటేల్, స్వామి, శ్రీను, కృష్ణం రాజు పాల్గొన్నారు.

● **భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ**

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా దశరత్, ప్రధాన కార్యదర్శిగా ముదాం అరుణ్, కోశాధికారిగా నాగరాజు, ఉపాధ్యక్షునిగా సాయిబాబా, ఈశ్వర్, సహాయ కార్యదర్శులుగా స్వామి, శ్రీనివాస్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు.

భారత రాజ్యాంగ దినోత్సవం



బాన్సువాడలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



లింగంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న కళాశాల విద్యార్థులు



ఎల్లారెడ్డిలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

భిక్కనూరు/బాన్సువాడ రూరల్/ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట/బిచ్కుంద, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని సిద్దరామేశ్వరనగర్ గ్రామంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రఘు మాట్లాడుతూ రాజ్యాంగం ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల సిబ్బంది, నాయకులు, అబేద్కర్ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్ : బాన్సువాడ మండలంలోని బుడ్మి, తాడ్కోల్, ఇబ్రహీంపేట్, కోనాపూర్, బర్లం, తదితర గ్రామాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు అంబేద్కర్ సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కుమ్మరి రాజు, దత్తు, గంగారాం, పాయిలు, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి రూరల్ : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ చౌరస్తాలో గల బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ పౌరులందరికీ స్వేచ్ఛా సమానత్వం సౌభ్రాతృత్వం ఉండాలని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి బాటలు వేసే విధంగా బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కంతి పద్మారావు, సామెల్, సాయిలు, ప్రభాకర్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట : దేశానికి రాజ్యాంగం ఆత్మ అని, దానిని పాటించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ అన్నారు. ఆయన బుధవారం కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లెక్చరర్లు దుర్గయ్య, రాజయ్య, నాగు, అంజయ్య, స్వామిగౌడ్, షైమద్, సంధ్య, శ్రీలత, ఆనంద్ రెడ్డి, నాగయ్యలతో పాటు, విద్యార్థులు ఉన్నారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ముదాం సాయిలు, ప్రభులింగం, అల్లూరి, రాజయ్య, లెగ్గల రాజు, లక్ష్మయ్యలతో పాటు నాయకులు ఉన్నారు.

బిచ్కుంద : మండలంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వినిల్‌కుమార్ మాట్లాడుతూ చట్టాలపై అందరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అదే విధంగా డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

పంచాయతీ ఎన్నికలను..

(5వ పేజీ తరువాయి)

సమస్యలు ఉంటే 9908712421 కాల్ సెంటర్‌ను జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామని ఈ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. పట్టణాల్లో మినహాయిస్తే గ్రామాల్లో, మండలాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ఎవరు కూడా ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి ఎక్కువ తీసుకెళ్లరాదన్నారు. ఎవరైనా అంతకుమించి ఎక్కువ తీసుకెళ్తే ఆ డబ్బులు సీజ్‌చేస్తామన్నారు. ఎన్నికల్లో పోటీచేసే సర్పంచ్ అభ్యర్థులు నిబంధనల ప్రకారం ఖర్చుచేయాల్సి ఉంటుందన్నారు. 5 వేల జనాభా కంటే ఎక్కువగా ఉండే గ్రామాల్లో పోటీచేసే అభ్యర్థులు రూ.2.50లక్షలు ఖర్చుచేయవచ్చన్నారు. 5 వేల కంటే తక్కువగా ఉన్న గ్రామాల్లోని అభ్యర్థులు రూ.1.50లక్షలు, అదే విధంగా వార్డు స్థానాలకు పోటీచేసే వారు 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో రూ.50 వేలు, తక్కువగా ఉంటే రూ.30 వేలు ఖర్చుచేయవచ్చన్నారు. సర్పంచ్‌గా నామినేషన్ వేసేందుకు రిజర్వ్ అయిన స్థానాల్లో అభ్యర్థులు రూ.1000 డిపాజిట్ చేయాలని, జనరల్ స్థానాల వారు రూ.2 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. వార్డు స్థానాల్లో రిజర్వ్ అభ్యర్థులు రూ.250, జనరల్ అభ్యర్థులు రూ.500 నామినేషన్ ఫీజు ఉంటుందన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు పోలీసుశాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటుందన్నారు. నేటి నుంచి నామినేషన్‌లు మొదలవుతున్నందున అన్ని గ్రామాల్లో, నామినేషన్ సెంటర్‌ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని లైసెన్స్ గన్‌లను ఇప్పటికే పోలీసుశాఖలో డిపాజిట్ చేయించామన్నారు. 260 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా అతి సమస్యాత్మకమైన 223 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఆ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచడమే కాకుండా పోలింగ్ సమయంలో బందోబస్తు పటిష్టంగా చేపడుతామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసుశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. విలేకరుల సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మదుమోహన్, ట్రైనికలెక్టర్ రవితేజ, డీపీఓ మురళి,డీపీఆర్‌ఓ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం భగవద్గీత లాంటింది

▶▶ **కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్**

కామారెడ్డిటౌన్,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం భగవద్గీత లాంటిందని ప్రతి ఒక్కరు చదివి రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులు,బాధ్యతలు తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. భారతరాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భారతదేశాన్ని సార్వభౌమ,సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నెలకొల్పుటకు పునరంకితమవుతా యని అధికారులు సిబ్బందితో భారత సంవిధాన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రానికి పూర్వం వివిధ రాజుల కాలంలో ఒక్కో చట్టం ఉండేదని, స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రతి పౌరుడికి న్యాయం జరగాలని, అందరికి ఆమోద యోగ్యంగా రాజ్యాంగం లిఖించుకోవాలని కమిటి ఏర్పాటుచేసి, అంబేద్కర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులు ఎంతో శ్రమించి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులలో అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించారని అన్నారు.దేశంలో ఉన్న విభిన్న జాతులు,మతాలు,జీవనవిధానం, జీవనశైలిని దృష్టిలో పెట్టుకుని అందరికి సమన్యాయం చేయాలని ఉద్దేశ్యంతో రాజ్యాంగాన్ని రచించారన్నారు. రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడు సమాజంలో జీవించడానికి సమానహక్కులు, బాధ్యతలు కల్పించిందని, నేడు వ్యవస్థ కూడా రాజ్యాంగానికి లోబడి నడుస్తున్నదని ప్రతి సమస్యకు జవాబు దొరుకుతుందని, కాబట్టి ప్రతి ఒక్కరు రాజ్యాంగాన్ని చదివి ఆకలింపుచేసుకోవాలని తెలిపారు.బలమైన దేశంగా ఉండడానికి కారణం మన రాజ్యాంగమేనని,రాజ్యాంగం దేశానికి రక్షణ కవచంలా పనిచేస్తుందని అన్నారు.కుల,మత తారతామ్యాలు లేకుండా 18 ఏళ్లనిండిన ప్రతి ఒక్కరికి రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపుకలెక్టర్ మధుమోహన్,డిప్యూటి ట్రైని కలెక్టర్ రవితేజ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ ఆదర్శ పాఠశాల

▶▶ **పాఠశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డి**



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సదాశివనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటుగా క్రీడల్లోనూ సదాశివనగర్ ఆదర్శ పాఠశాల అగ్రగామిగా నిలుస్తుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డి అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా స్థాయిలోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పీడీఎస్ బియ్యం వేలం



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రేమ్‌కుమార్

ఎల్లారెడ్డిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో సివిల్‌సప్లై అధికారులు ఇటీవల నిర్వహించిన దాడులలో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని గురువారం వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని సివిల్ సప్లై గోదాంలో నిల్వచేశారని, కలెక్టర్ ఆదేశాల మేరకు వాటిని వేలం వేస్తున్నామన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.5వేలు డిపాజిట్ చేయాలన్నారు.

క్షేత్రస్థాయిలో విద్యార్థుల పర్యటన



దోమకొండ దుబ్బ బంగ్లాలో సౌత్‌క్యాంపస్ సోషల్ విద్యార్థులు

దోమకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో బుధవారం సౌత్‌క్యాంపస్ సోషల్‌వర్క్ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. దోమకొండ గడి విలేజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పర్యటనలో భాగంగా ట్రస్ట్‌చేస్తున్న పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, ఆరోగ్య క్యాంపులు, లైటింగ్ తదితర సేవా కార్యక్రమాలు సందర్శించారు. గడికోట మేనేజర్ బాబ్జి ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలను తెలిపారు. కార్యక్రమంలో రమాదేవి, సంతోష్‌గౌడ్, 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

శుభ కార్యాలకు విరామం

(5వ పేజీ తరువాయి)

జరిపించడం శుభసూచికం కాదని సూచిస్తున్నారు.

వ్యాపారాలపై ప్రభావం..

శుభకార్యాలు లేకుంటే వివాహ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, వస్త్ర దుకాణాలు, నగల షాపుల యజమానులు, స్వర్ణకారులు, క్యాటరింగ్, ఫెడరేషన్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, టెంట్‌హౌస్, పూల దుకాణాలు, లైటింగ్, డీజే, అద్దె కార్లు, బస్సులు సంబంధిత రంగాల వ్యాపారులు నెలల కొద్ది నష్టపోవాల్సి వస్తోంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

26 నుంచి శుభముహూర్తాలు లేవు

▶▶ **వేద పండితులు గణేష్ శర్మ, బోధన్**

ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడునెలల పాటు శుభకార్యాలకు మంచి రోజులు లేవు. శుక్రమౌఢ్యం వల్ల ఒక్క శుభ ముహూర్తం ఉండదు. శుభకార్యాలతో పాటు గృహప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు, ఆఖరికి వరపూజలవంటి కార్యాలు కూడా చేసుకోకూడదు. వైవాహిక పురోహితులకు ఈ మూడు నెలలు గడ్డు కాలమే. శుభాలకు అధిపతులు అయిన గురు. శుక్రుడు సూర్యుడికి సమీపంగా రావడంతో శక్తిని కోల్పోతాయి.

‘సమరశంఖం పూరిద్దాం’



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దీక్షా దివస్ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సమర శంఖం పూరిద్దామని బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిలా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం దీక్షా దివస్ సన్నాహక సమావేశాన్ని పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. ప్రతిగులాబీ సైనికుడు కేసీఆర్‌లా మారి కాంగ్రెస్‌ను తెలంగాణ నుంచి శాశ్వతంగా తరిమి కొట్టడానికి కదం తొక్కాలన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం కల సాకారమైందన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమాలు రగిలించిన యోధు డు కేసీఆర్ అని కొనియాడారు. 36 పార్టీలను ఒప్పించి జై తెలంగాణ అనిపించిన కేసీఆర్ పోరాట స్ఫూర్తితో కాంగ్రెస్ పాలనకు ముగింపు పల కాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పతనం మొదలైందన్నారు. కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయడంలో జిల్లా కీలక పాత్ర కావాల న్నారు. జిల్లా బీఆర్‌ఎస్ కంచుకోట అని, కాంగ్రెస్ పతనాన్ని ఇందూరు గడ్డ నుంచే శాసిస్తామన్నారు. రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు ఉన్నాయన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు గాలిలో కలిసి పోయాయన్నారు. 420హామీలు అమలు ఊసే లేదని ధ్వజమెత్తారు. దీక్షాదివస్ సందర్భంగా రక్తదాన శిబిరాలు, అన్నదానాలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, పండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రథయాత్ర

నిజామాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవ వజ్రోత్సవాల సందర్భంగా భారతీయ సంవిధాన్ ప్రచారక్ దళ్ ఆధ్వర్యంలో రథయాత్ర ర్యాలీని బుధవారం నిర్వహించారు. వ్యవసాయ రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు ఉన్నారు.

నూతన భవనంలోకి రూరల్ ఠాణా

నిజామాబాద్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీసు స్టేషన్ కంఠేశ్వర్‌లో నూతనంగా నిర్మించిన భవనంలోకి మారింది. బుధవారం ఉదయం న్యూహౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి కంఠేశ్వర్‌లోని నూతన భవనంలోకి స్టేషన్ కార్యకలాపాలను మార్చారు. ఆధునిక వసతులతో, విశాలమైన స్థలంలో పోలీసుస్టేషన్ నిర్మించడం పట్ల సీఐ శ్రీనివాస్ సంతృప్తి వ్యక్తం చేశారు. రూరల్ ఠాణాను కొత్త భవనంలోకి మార్చామని, ప్రారంభోత్సవం వంటి కార్యక్రమాలేమీ చేయలేదన్నారు. అధికారికంగా ప్రారంభిస్తామన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- బాహుబలి (ది ఎపిక్)
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి రాజు వెడ్స్ రాంబాయి
వెంకటేశ్వర ఆంధ్రాకింగ్

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

చికిత్స కంటే నివారణే మేలు

సుభాష్‌నగర్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): రక్తహీనత సమస్యకు చికిత్స కంటే నివారణనే ఉత్తమ మార్గమమని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఐరన్ లోప నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రక్తహీనత అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రాజశ్రీ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో ప్రజలు రక్తహీనతతో బాధపడుతున్నారని, ఐఎంఏ సేవా దృక్పథంతో ముందుకొచ్చి అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం ఐఎంఏ అధ్యక్షుడు విశాల్, కార్యదర్శి హరిస్వామి మాట్లాడుతూ.. రక్తహీనతపై గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి సమస్య నివారణకు కృషి చేస్తామన్నారు. రక్తహీనత వల్ల శరీరంలోని అవయవాలు సరిగా పని చేయకపోవడంతో పాటు అనారోగ్య సమస్యలు దరిచేరుతాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వ్యక్తులు వైద్యులను సంప్రదించి కార్యక్రమంలో ఐఎంఏ నేషనల్ ఆక్షన్ కమిటీ చైర్మన్ రవీంద్రరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు జీవన్‌రావు, కొట్టూరు శ్రీశైలం, శ్రీనివాస్, డాక్టర్ మురళీకృష్ణ, డీహెచ్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎమ్మెల్యే రౌడీయిజం

▶▶ **బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి**

సుభాష్‌నగర్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గుండా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, ఆయనపై కేసు నమమోదు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సీపీ కార్యాలయంలో అదనపు డీసీపీ బస్వారెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. భూపతిరెడ్డి జిల్లాలో కబ్జాలు, మొరం, ఇసుక దందాలను నడిపిస్తున్నారని, బహిరంగంగా గుండాయిజం, రౌడీయిజాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. మంగళవారం పాల్దాలో బీజేపీ నాయకులపై దాడిచేశారని ఆయన ఆరోపించారు. ఇటువంటి దాడులకు బీజేపీ నాయకులు భయపడరని, పద్ధతి మార్చుకోవాలన్నారు. పోలీసు అధికారులు వెంటనే ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని లేకపోతే పెద్దఎత్తున ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, భూపతిరెడ్డిని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. గతంలో బీఆర్‌ఎస్ నాయకులు సైతం ఇలానే చేశారని బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. కార్యక్రమంలో రూరల్ కన్వీనర్ పద్మారెడ్డి, జగన్‌రెడ్డి, నాయకులు ప్రమోద్, శంకర్, ఆనంద్, విజయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.